

నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 45

# రాస్తే రావిశాస్త్రిగారిలా రాయాలనుకునేవాణ్ణి!

- డా. కె. వివేకానందమూర్తి

అందమైన వాడు. ఆనందం మనిషైన వాడు. కలల పట్టు కుచ్చులూగుతున్న కిరీటం ధరించిన వాడు. కళ్ళ చివర కాంతి సంగీత గీతాన్ని రచించిన వాడు. ఎర్రని పెదవుల మీద తెల్లని నవ్వుల వీణల్ని మీటుతూ జీవితాన్ని ప్రేమించిన వాడు. జీవించడం తెలిసిన వాడు. ప్రతి నిమిషాన్ని ఒమర్ ఖయ్యాం రుబాయత్ అనుకుని అనుభవించే వాడు, ఆహ్లాదించేవాడు. ఎవరంటే? ఇంకెవరు? అతడే డాక్టర్ కె. వివేకానందమూర్తి. ఆకాశమ్మీద వయ్యారంగా పరిగెత్తే అప్సరసల్లాంటి తెలుగు అక్షరాల్ని కాగితమ్మీద కొలువుదీర్చి 'కథంటే ఇది' అని అతను చెబితే తప్పదు! వినాలి. తర్వాతే మనమేమయినా అనాలి. వినండి మరి!

డాక్టర్ కె. వివేకానందమూర్తిగారు లండన్‌నుంచి వచ్చి, హైదరాబాద్‌లోని లక్డీకాపూల్ వద్ద ఉన్న 'సెంట్రల్ కోర్ట్'లో ఉన్నారని తెలిసింది. మరో వారం రోజుల్లో లండన్ వెళ్లిపోతారనే విషయం కూడా తెలిసింది. నేనూ నవ్య వీక్లీ ఎడిటర్ జగన్నాథశర్మగారు కలసి అక్కడకు వెళ్లాము. ఆయన మమ్మల్ని బాగా రిసీవ్ చేసుకున్నారు. తన గురించి చెప్పమంటే అలా చెప్పలేనన్నారు. సరదాగా ముగ్గురం మాట్లాడుకుందాం. అదే నా గురించి చెప్పడం అన్నారు. మాట్లాడసాగారు. ఆ మాటల వెనక తన జీవితంలోని బరువైన సంఘటనలనూ, సందర్భాలను వివరించారు.




## నేను అష్టమసంతానం

మాది పశ్చిమగోదావరి జిల్లా తణుకు. కడియాల ముత్యాలమ్మ, సుబ్బన్నశాస్త్రి మా అమ్మా నాన్నలు. మేం మొత్తం ఎనిమిది మంది పిల్లలం. నేను అష్టమ సంతానం. మాది మధ్యతరగతి కుటుంబం. నాన్న టీచర్. మాకు తణుకులో ఇల్లుంది. సొంత పొలముంది. అయినా కుటుంబ జీవనం కష్టమే! తణుకు స్కూల్లో, విశాఖపట్నం ఆంధ్రామెడికల్ కాలేజీలో నా విద్యాభ్యాసం సాగింది.

## రావిశాస్త్రిగారి ప్రభావంనుంచి తప్పించుకున్నాను

మా తణుకులో దేవరకొండ బాలగంగాధర తిలక్‌గారు ఉండేవారు. ఆయనకి పాటలన్నా, కథలన్నా ఇష్టం. నేను ఆయన కథలూ, ఆయన సూచించిన కథలు చదివాను. తిలక్‌గారి పిల్లలూ మేమూ హైస్కూల్లో క్లాస్‌మేట్స్. అప్పటికింకా గ్లాస్‌మేట్స్ కాలేదు. నేను హైస్కూల్లో ఉన్న రోజుల్లో మాకు నాటకాల పోటీ పెట్టారు. దానికి తిలక్‌గారు జడ్జి. నాటకాల్లో వారి పిల్లలు కూడా ఉన్నారు. అయితే ఆయన నాకు మొదటి బహుమతి ఇచ్చారు. అప్పటికే నాకు కథపైన కొన్ని అభిప్రాయాలుండేవి. అయితే, చదువుకోసం విశాఖపట్నం వచ్చాక అక్కడ రావిశాస్త్రిగారినీ, వారి రచనలను చూశాను. అప్పటికే రావిశాస్త్రిగారి రచనా శైలిని అనుకరించి రాసిన రచయితలు చాలామంది ఉండేవారు. 'రావిశాస్త్రిలా రచించని జీవితమేల?' అని పెద్దపెద్ద వాళ్లే అనేవారు. ఆయన కథలు చదివాక కథా వస్తువుల మీదా, కథను నడిపించే పద్ధతి మీదా, వాక్య నిర్మాణం మీదా అంతకు ముందు నాకున్న అవగాహన పూర్తిగా మారిపోయింది. నేను వైజాగ్‌లో కృష్ణానగర్‌లో రూములో ఉండేవాడిని. రావిశాస్త్రిగారు బి.ఎన్.శర్మ గార్డెన్స్‌లో ఉండేవారు. ఆయన్నుంచీ, ఆయన శైలినుంచి తప్పించుకోవాలని విశ్వప్రయత్నం చేశాను. గెలిచాను. నా రచనల మీద ఆయన ప్రభావం లేదని నా నమ్మకం.

## హీరోకి తక్కువ, సెకండ్ హీరోకి ఎక్కువ

నా మొదటి కథ 1963లో వచ్చింది. నేను మెడికల్ కాలేజీ విద్యార్థిగా ఉన్న రోజుల్లో ఎక్కువ కథలు రాశాను. అవన్నీ సీరియస్ కథలే! నా కథల్లో వాక్య నిర్మాణంలో కొంచెం హాస్యం, చమత్కారం ఉన్నప్పటికీ నాకంటే 15, 20 సంవత్సరాల పెద్దవాళ్ళు వాటిని మెచ్చుకున్నారు. నా మొదటి కథ అచ్చయిందో లేదో, దానిని నండూరి రామమోహనరావుగారు ప్రశంసించారు. నాకు చిన్నప్పటినుంచీ నాటకాలంటే పిచ్చి. నన్ను చాలామంది సినిమాల్లో నటించమని చెప్పారు. నాక్కూడా ఆ రంగంపై మనసు మళ్లింది. అక్కినేని, శోభన్‌బాబు, అనంతనాగ్ మొదలైన వారితో సెకండ్ హీరోగా నటించాను. అయితే అక్కినేనిగారితో నటించిన రెండు సినిమాల్లోనూ నాకు ఎక్స్‌ట్రాకి ఎక్కువ, సెకండ్ హీరోకి తక్కువ పాత్రలే వచ్చాయి. నాకున్న బంధువులూ, శ్రేయోభిలాషులు నా యాక్టింగ్ టాలెంట్‌ను మెచ్చుకున్నప్పటికీ నేను డాక్టర్‌గా ఉంటేనే రాణిస్తానని చెప్పారు.




## ఎస్వీ రంగారావుగారు మద్రాసు రమ్మని ఉత్తరం రాశారు

నేను వైజాగ్‌లో ఉన్న రోజుల్లోనే డ్రామాలేసేవాడిని. ఫంక్షన్లకు హాజరయ్యేవాడిని. ఎస్వీ రంగారావుగారి సిస్టర్స్ వైజాగ్‌లో ఉండేవారు. ఓసారి వారింటికి ఆయన వచ్చారు. జయరాం అనే అతను నన్ను ఎస్వీ రంగారావుగారికి పరిచయం చేశారు. వారు నాతో 'సినిమాల్లో వేస్తావా' అన్నారు. 'సినిమా ఇంట్రస్టయితే ఫోటోలు పంపించు' అన్నారు. వారు ఊరెళ్లిన కొన్ని రోజులకే ఆయన దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. ఓ సినిమాలో అవకాశం ఉందని, స్క్రీన్ టెస్ట్‌కు రమ్మని దాని సారాంశం. ఇంకేం, నేను వెంటనే మద్రాసు వెళ్లిపోయాను. నన్ను ఆరుద్రగారు రిసీవ్ చేసుకున్నారు. చివరకు ఆ సినిమాలో వేషం రాలేదు. తిరిగి వచ్చేశాను. ''ఏట్రా యాక్టరూ.. ఎప్పుడు షూటింగ్.. మేకప్పు ఏసుకున్నావా'' అంటూ ఫ్రెండ్స్ ఏడిపించేవారు.

## మిమిక్రీ చేసేవాడిని

సి.పుల్లయ్య గారి పుట్టిన రోజు ఆ ఏడాది మద్రాసులోని విజయాగార్డెన్స్‌లో జరిగింది. నేనప్పట్లో మిమిక్రీ చేసేవాడిని. నన్ను రావికొండలరావుగారు పుల్లయ్యగారికి పరిచయం చేశారు. వారు నాకో వేషం ఇచ్చారు. గుమ్మడిగారికి మిమిక్రీ అన్నా, నేనన్నా చాలా ఇష్టం. వరుసగా వేషాలు వచ్చాయి. కె.ఎస్.ప్రకాశరావుగారి దగ్గర ఏడేళ్లు పనిచేశాను. నేను చాలా యంగ్. యూనిట్‌లో అందరికంటే నేనే చిన్నవాడిని. అందువలన నన్ను అందరూ బాగా లైక్ చేసేవారు. ఇక వైజాగ్‌కు చదువుకోసం పోకూడదని, ప్రొఫెషనల్ ఆర్టిస్ట్‌గా ఉండిపోవాలని నిర్ణయించుకున్నాను.

## సావిత్రిగారి సలహాతో మెడిసిన్ పూర్తి చేశాను

ఓసారి మద్రాసులో ఐ.ఐ.టి.లో ఓ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అక్కడ నా మిమిక్రీ ప్రోగ్రామ్ ఉంది. ఆ కార్యక్రమానికి మహానటి సావిత్రి వచ్చారు. ప్రోగ్రాం అంతా అయిపోయాక ఆవిడ నాతో ఆప్యాయంగా మాట్లాడారు.

''మెడిసిన్ చదివావు. ఎందుకిలా వేషాలు వేస్తున్నావు. ఉదాత్తమైన మెడిసిన్ చదువును అలా వదిలేయడం తప్పు. నేను తలచుకుంటే నీకు సినిమా రంగంలో వేషాలు దొరకకుండా చేయగలను. నువ్వు డాక్టర్ కోర్సు పూర్తి

చేశాక కూడా నీకు సినిమా నటన మీద వ్యామోహం తగ్గకపోతే ఇక్కడకు రా. అప్పుడు నీకు పుష్కలంగా వేషాలు దొరికేట్లు చూస్తాను'' అన్నారు నాతో.

నేను యంగ్ కదా, వెంటనే ''మీరెందుకు యాక్ట్ చేస్తున్నారు'' అన్నాను.

''వేరే ఏ పనీ చేయలేక వేషాలు వేస్తున్నాను. నాకేమన్నా సరదానా'' అన్నారు సావిత్రి.

దాంతో నాకు పట్టుదల పెరిగింది. నా మెడిసిన్ చదువులో చివరి ఏడాది రెండు సబ్జెక్టులు ఉండిపోయాయి. సినిమా, నాటకం, మిమిక్రీ, కథా రచన- అన్నిటినీ పక్కన పెట్టేసి పట్టుదలగా చదివి పరీక్షలు రాసి పాసయ్యాను. హౌస్ సర్జన్ కూడా పూర్తి చేశాను. ఆ రెండేళ్ళూ నేను అనుభవించిన దారిద్ర్యం, క్షోభ చెప్పడానికే కాదు, తలచుకోవడానికి కూడా బాధగా ఉంటుంది.

## డబ్బు సంపాదించి సినిమా తీయాలనుకున్నాను

చదువైపోగానే మళ్లీ వేషాలకోసం మద్రాసు వెళ్లాను. అయితే అనుకున్నంతగా వేషాలు దొరకలేదు. తిరిగి వైజాగ్ వచ్చేశాను. మెడిసిన్‌లో నా బ్యాచ్ మేట్‌లు కొందరు అప్పటికే అమెరికా వెళ్లారు. సెలవులకు ఇక్కడకు వచ్చిన వాళ్లు నా ముందు భలే ఫోజులు కొట్టేవారు. నాకు వారి ఫోజులు చూసి బాధేసేది. వాళ్లదగ్గర డబ్బు ఉంది కాబట్టి అలా ఫోజులు కొడుతున్నారు. నేను కూడా డబ్బు సంపాదించాలి అనుకున్నాను. ఫారిన్ పోయి డబ్బు సంపాదించుకుని వచ్చి సినిమా తీయాలని అనుకున్నాను. 1967-72 ప్రాంతంలో ఒక సినిమా తీయడానికి 7నుంచి 13 లక్షలు ఖర్చయ్యేది. అయితే నన్ను అమెరికా తీసుకెళ్లేదెవరు? కొందరు మిత్రులు మాటిచ్చారు తీసుకెళ్తామని. అయితే వారి మాటలు ఇక్కడే వదిలేశారు. నాకెవ్వరూ సాయం చేయలేదు.

## అన్నం పెట్టని అమ్మని వదిలేయవలసిందే!

నా జూనియర్ విజయకుమార్ కూడా అమెరికాలో ఉండేవాడు. అతడికి సెండాఫ్ ఇవ్వడానికి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లాను. అక్కడ నా ఫ్రెండ్, చదువుకునే రోజుల్లో రూమ్మేట్ అయిన పుల్లెల సుబ్రహ్మణ్యం కనిపించాడు. తను అప్పుడు జాంబియాలో ఉంటున్నాడు. నన్ను జాంబియాకు తీసుకెళ్తానన్నాడు. ఇప్పటికే చాలామంది ఇలా చెప్పారన్నాను. అతను అక్కడకు వెళ్లిన కొద్ది రోజులకే జాంబియా రావడానికి టిక్కెట్ డబ్బులు రెడీ చేసుకోమని నాకు ఉత్తరం రాశాడు. అప్పటికింకా నాకు సినిమాల పిచ్చి వదల్లేదు. మహాకవి ఆత్రేయ గారిని కలిసి నా జాంబియా ఉద్యోగం సంగతి చెప్పాను. వారు మనసును తట్టే ఒక మాటన్నారు ''అన్నం పెట్టని అమ్మని వదిలేయవలసిందే!''

ఆయన ఉపయోగించిన 'అమ్మ' అనే మాటలో మాతృదేశం అనే అర్థమే ఉంది. ఇంక ఆలోచించలేదు. జాంబియా వెళ్లిపోయాను. జాంబియాలో ఎన్‌డోలా అనే నగరంలో ఉన్న అతిపెద్ద హాస్పిటల్‌లో అన్ని విభాగాలలో పనిచేశాను. ఎక్కువ కాలం గైనిక్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశాను. 'సిల్వియా లెరెల్' అనే సీనియర్ లేడీ డాక్టర్ మాకు బాస్. ఆమె వద్ద పని చేయడానికి ఎవ్వరూ సాహసించేవారు కాదు. నన్ను కూడా 'ఆమె ప్రాణం తీసేస్తుందిరా, చంపేస్తుందిరా' అన్నారు మిత్రులు. అయినా సరే నేను ఆమె దగ్గర జూనియర్‌గా జాయిన్ అయ్యాను. అది 30 ఫ్లోర్ల బిల్డింగ్. 'డ్యూటీకి ఐదు నిముషాలు లేట్‌గా వచ్చినా కిటికీలోంచి విసిరేస్తాను' అంది ఆమె. 'అయిదు నిముషాలు లేట్ చేశావంటే బ్లీడింగ్ అయ్యే పేషెంట్ చనిపోవచ్చు. తెలుసా?' అందామె. అంతే! నేను నోరెత్తకుండా పని చేశాను. రెండేళ్లు అక్కడ పని చేశాను. నా వర్క్ ఆమెకు బాగా నచ్చింది. నా సిన్సియారిటీ నచ్చింది. ఇంగ్లండ్‌లో పనిచేసే అవకాశం వచ్చింది. నాకంటే సీనియర్లు చాలామంది అక్కడకు వెళుతున్నారు. వారంతా సిల్వియా దగ్గర పనిచేస్తున్నట్టుగా ఆమెను లెటర్లు అడిగారు. నేను మాత్రం అడగలేదు. నన్ను 'కడియాలు కడియాలు' అని పిలిచేది. ఓ రోజు ఆమె నా రూమ్‌కు వచ్చి ''నువ్వెందుకు లెటర్ అడగలేదు''అంది. నాకు టైమ్ లేదన్నాను. ఒక వారంలో అన్నీ ఆమె సెటిల్ చేసేసింది. ఇంగ్లాండ్‌లో పనిచేసే అవకాశం కల్పించింది. ఇక అక్కడినుంచి వెనక్కి తిరిగి చూసుకునే అవసరం రాలేదు.

## నా వృత్తి వలన రాయలేకుండా ఉన్నా


విశాఖపట్నంలో ఒక జోకుండేది ''కథలు రామకోటిలాగా రాసేయడం కన్నా, రామకోటిగార్లాగా రాయడం మంచిది'' అని. రామకోటిగారి కథలు అంత గాఢంగా ఉంటాయి. అయితే లండన్‌లో నాకు సమయం ఉండేది కాదు. నేషనల్ హెల్త్ సర్వీసులో సీనియర్ జనరల్ మెడికల్ ప్రాక్టీషనర్‌గా రెండు దశాబ్దాలకు పైగా ఉన్నాను. ఆ సమయంలో పనిఒత్తిడి మధ్య కూడా కొన్ని కథలు రాశాను. అయితే వాటి నిడివి తగ్గిపోతూ వచ్చింది. కథలు రాయాలనే తపన ఉంటుంది కాని నా వృత్తి వలన నేను రాయలేకుండా ఉన్నాను.

## 'యునైటెడ్ కింగ్‌డమ్ తెలుగు ఆర్ట్స్' స్థాపించాను

యు.కె.లో తెలుగు డాక్టర్లం చాలామంది ఉన్నాం. మేమందరం కలసి 'ఆంధ్ర మెడికల్ గ్రాడ్యుయేట్స్ రీ యూనియన్' అనే సంఘం ఏర్పాటు చేశాం. ఈ సంఘం ఏడాదికొకసారి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఇందులో నాది చురుకైన పాత్ర. ఇక నేను యునైటెడ్ కింగ్‌డమ్ తెలుగు ఆర్ట్స్ (UKTA) స్థాపించాను. ఈ సంస్థ కార్యక్రమాలకు కూడా చాలా సమయం కేటాయిస్తున్నాను. ఈ సంస్థను దర్శకేంద్రుడు రాఘవేంద్రరావుగారు ప్రారంభించారు. బాపు గారితో సహా ఎందరో ప్రముఖులు మా కార్యక్రమాలకు అతిథులుగా వచ్చారు. 'యుక్త' ఎంబ్లమ్ బాపుగారే చేశారు.

## 'చిత్రజ్యోతి'కి మొదటి ఎడిటర్‌ను

ఓసారి రాజబాబు నాతో రివెంజ్ తీర్చుకోవడం గురించి ఏం చెప్పారంటే


యుకె హెల్త్ మినిష్టర్ యాండిబర్నమ్, టామ్ షెరాట్‌లతో గార్డెన్ పార్టీలో

''మనం పైకి రావడమే రెస్పాన్స్. అదే వాడికి హింస. బెస్ట్ వే ఆఫ్ రివెంజ్, దటీజ్ సక్సెస్'' అన్నారు. ఇది ఎప్పటికీ మరచిపోలేని, మరచిపోకూడని మాట. నాకు చాలామంది సినిమా వాళ్లతో పరిచయాలున్నాయి. 'చిత్రజ్యోతి' పత్రిక మీకు తెలిసే ఉంటుంది. దానికి మొదటి ఎడిటర్‌ను నేనే!

## రూపు రేఖలు మనవి, బిహేవియర్ వాళ్లది

లేడీస్ ఏం చేసినా, ఏం మాట్లాడినా దానికో అర్థం ఉంటుంది. దానికో ప్రయోజనం ఉంటుంది. నా జీవితంలో టర్నింగ్ పాయింట్లన్నీ స్త్రీలతోనే ముడిపడి ఉన్నాయి. ప్రతి మనిషి పుట్టుకకు తల్లే కారణం. ఇక నా మెడిసిన్ పూర్తయ్యేలా చేసింది మహానటి సావిత్రి మాటలు. లండన్ వెళ్లి అక్కడ పేరు తెచ్చుకోవడానికి కారకురాలు సిల్వియా లెరెల్. నాకు లక్ష్మితో 1974లో పెళ్ళయింది. మాకు ఇద్దరు అమ్మాయిలు. ఇద్దరూ డాక్టర్లే! వాళ్లు అక్కడే పుట్టి పెరిగారు కదా. రూపు రేఖలు మాత్రమే మనవి, బిహేవియర్ అంతా తెల్లవాళ్లది. పెద్దమ్మాయి రుద్రాణికి భమిడిమర్రి రాఘవ సత్యకుమార్‌తో పెళ్ళయింది. అందరూ యు.కె.లోనే ఉంటున్నారు.

-సుంకోజి దేవేంద్రాచారి

నాకు నచ్చిన నా కథ

# నేను చూసిన నక్షత్రం

- డాక్టర్ కె. వివేకానందమూర్తి

**నాకీ మధ్య హఠాత్తుగా కథలు రాసే యావ తగ్గిపోయి రాయడం మానేశాను. కథ రాయడం మానేయడానికి కథ వుంది.**
**నేనెప్పుడూ కంచికి వెళ్ళిన కథే మంచికథ అనుకుంటాను. కథలు ముమ్మరంగా రాసే రోజుల్లో నేనోసారి కంచికి వెళ్ళేను. నా కథ లెక్కడేనా కనిపిస్తాయేమోనని కాంచీపురమంతా కళ్ళు కంచుకాగడాల్లా చేసుకుని కాంచేను. కనిపించలేదు. నేను కంచికి చేరినా నా కథలు కంచికి చేరలేదు. అంచేత నేను మంచివి రాయలేదనుకున్నాను. నాకు చాలా బాధేసింది. భయమేసింది. దాంతో కథ వ్రాయడం మానేశాను - అలా వ్రాయకపోవడం వల్ల వూసుపోడం మానేసింది. తోచడం కోసం తోచినప్పుడల్లా సినిమాలు చూడ్డం ప్రారంభించాను. అలా చూడగాచూడగా చూడ్డం ముదిరిపోయి, నన్ను కూడా అలా తెరమీద అందరూ చూస్తే బావుణ్ణనిపించింది. తక్షణం రచయితగా రాయడం మానేసి, తెరమీద నటుడినై రాణించాలనుకున్నాను. ఉత్తరక్షణం లుంగీ కట్టుకుని మద్రాసు పోయే రైలెక్కేశాను.**

మద్రాసు నగరం మహత్తరంగా అనిపించింది. కొత్తజీవితం గురించి కొత్త కలలు కంటూ పాండీబజార్లో బృందావన్ లాడ్జిలో దిగాను. రైలు ప్రయాణం బడలికలో ఆ పగలంతా నిద్రలో టెక్నికలలు కూడా కన్నాను.

సాయంత్రమైంది. రూముకి తాళం వేసి బజార్లో కొచ్చేను. అటూ యిటూ చెట్లతో అశోకుడు పాలించిన రాజ్యంలా పాండీబజారు కళకళ్ళాడు తోంది. చెట్లకింద చిన్నతరహా నటులు తెలుగు మాట్లాడుకుంటున్నారు. కాఫీ తాగుదామని వీ.కె. రెస్టారెంటులోకి వెళ్ళేను. టేబులు దగ్గర ఒక్కణ్ణి కూర్చుని కాఫీ తాగుతూంటే కప్పు ఖాళీ అయ్యే సమయానికి ఎదుటి సీట్లో కూర్చుంటూ ఎవరో ఒకతను నన్ను పలకరించేడు.

''వేషాలకొచ్చేరా?'' స్వచ్ఛమైన తెలుగులో స్పాట్ డయగ్నోసిస్ చేసే శాడు.

''కాఫీ''

''మీరెవరు?'' అన్నా.

''నన్ను వేలుమణి అంటారు. ఈ ఫీల్డుకి పాతికేళ్ళు పాతవాడ్ని. యిక్క డికి రాక మునుపు వెంకటనరసయ్యని. కొత్తలో ఈ వూరు నీళ్ళుపడక పేరు మార్చుకున్నాను; ఇప్పుడు ఈ బజార్లో ఏ చెట్టు నడిగినా కొమ్మలూపు కుంటూ నా కథ చెప్తుంది'' కాఫీ వచ్చింది. ''మరో పట్టు పట్టండి'' మళ్ళా మరికాస్త కాఫీ తాగేను.

''పదండి. అలా నడుస్తూ మాట్లాడదాం'' బిల్లు నాచేతిలో పెట్టేడు.

పాతుకుపోయిన నటుడిలా అనిపించేడు నాకు. కానీ అతని బొమ్మ నేను ఏ చిత్రం లోనూ చూసిన గుర్తు లేదు.

''బీచ్‌కి వెళ్దామా?'' సిగరెట్టు వెలిగించేడు నాకొకటిస్తూ. నేను ముట్టి స్తూంటే పిలిచేడు - ''టాక్సీ!-''

టాక్సీ దిగేం, మీటరు చూసి వేలుమణి లెక్కచెప్పేడు. పే చేసేను. రోడ్డు దిగి యిసుకలో నడుస్తూంటే వేలుమణి మాట్లాడటం ప్రారంభించాడు.

''నేను పాతిక సంవత్సరాల క్రితమే నా నట జీవితం ప్రారంభించాను. ఎన్నో రకాల పాత్రలు ధరించాను. మీకు నచ్చిన పాత్ర ఏది? అని చాలా మంది ప్రెస్ మనుషులు చాలాసార్లు అడిగేరు. తల్లిని పిలిచి నువ్వు కన్న పిల్ల లందర్లోకీ ఎవర్ని ఎక్కువ అభిమానిస్తావని అడిగితే అందుకు ఆ తల్లేం బదులు చెప్పగలదు చెప్పండి? అదుగో ఆ తల్లి లాగే నేనూ తల్లడిల్లిపోయి సమాధానం చెప్పలేక పోయేవాడ్ని. బటానీలు కొనుక్కుందాం'' అన్నాడు కొనుక్కున్నాం.


''క్షమించాలి. మీరు ధరించిన పాత్రలేవీ నాకు చూసిన జ్ఞాపకం లేదు'' అన్నాను.

వేలుమణి బటానీలు పటపటలాడిస్తూ చెప్పాడు. ''అదుగో - అదే నటన అంటే. ప్రేక్షకుడి దృష్టిలో పాత్ర పాతుకుపోయినప్పుడు నటుడు జ్ఞాప కానికి రాడు. నేను పాత్రల్లో జీవించాను. అందుకే నా పాత్రలు జనానికెంత దగ్గరో నేనంత దూరమయి పోయాను'' మేం జనానికి బాగా దూరంగా నడుస్తున్నాం.

''మీ పాత్రలేమిటో చెప్పారు కాదు?'' అడిగాను.

''వస్తున్నా, వస్తున్నా - ఆ మధ్య 'పిడిలేని కత్తి' అనే జానపద చిత్రంలో అంతఃపుర ద్వారపాలకుడిగా నటించి అప్రతిహత నటనాచాతుర్యాన్ని ప్రక టించాను. అందులో మహారాణిగా నటించిన ప్రఖ్యాత నటీమణిని నేనే బయటికి వెళ్ళకుండా శూలం అడ్డుపెట్టాను, చూశారు! 'మెడతిప్పని వీరుడు' చిత్రంలో యుద్ధానికి పరుగుతీస్తున్న భటులలో ముందర నిలబడి ''పదండి!'' అని కేకేసిన వాణ్ని నేనే. అంతేకాదు ''హిడింబి'' అనే పౌరాణిక చిత్రంలో డ్యూయెల్ రోల్ ఏక్ట్ చేశాను. అంటే ఒక రాక్షసుడిగాను, ఒక ముని పుంగవుడి గాను నటించాను. ఈ రెండు విభిన్నమైన పాత్రలు. కానీ వాటిని స్టడీచేసి వాటికి న్యాయం చేకూర్చాను. పాత్రకి న్యాయం చేకూర్చడమంటే ఏమీలేదు. పాత్రని అర్థం చేసుకు నటించడం, అంటే రాక్షసుడి వేషంలో ఒక మునీశ్వరుణ్ణి బాధించాలనుకోండి. ముందు అతని గడ్డం పట్టుకోవాలా? కొప్పు పట్టు కోవాలా? అనేది ఆలోచించాలి, అలాగే శూలాన్ని రాజుగారికి గుచ్చుకోకుండా ఏ యాంగిల్‌లో ఎలా పట్టుకోవాలి? మొదలైనవన్నీ స్టడీ చెయ్యాలి. నేనలా స్టడీ చేసి నటించిన వేషాలన్నీ యాకరువు పెట్టాలంటే హాటలు కట్టేస్తారు. ఎన్నో చిత్రాల్లో పేపర్ బాయ్‌గాను, పోస్ట్‌మన్‌గాను మరియు పోలీసుగాను నటించాను. ఇంకా అనేక సాంఘిక చిత్రాల్లో క్లబ్ డాన్సులు, స్ట్రీట్ డాన్సులు అందరికంటే ముందు నిలబడి చూసేవాణ్ణి. అప్పుడు నాకిచ్చేది ఒక్క ఫ్రేమే అయినా, అందులోనే నా హావభావ ప్రకట నంతా గుప్పించేసే వాణ్ణి''. వేలుమణి నన్ను మాట్లాడనీయలేదు.

''అసలు నేనీ స్టేజికి రాకపూర్వం డబ్బింగ్ చిత్రాలకి గొంతు ఎరువిచ్చే



వాణ్ణి. ఓసారి నేను గొంతు ఎరువిచ్చిన డబ్బింగు చిత్రాన్ని విడుదలయ్యాక జనం మధ్య కూర్చుని చూశాను. అందులో ఓ సన్నివేశంలో హీరో చెంబు తీసుకొచ్చి యిచ్చేసిం తర్వాత కూడా హీరోయిన్ 'సఖా! ఆ చెంబు యిలా తీసుకురావూ' అని అడిగింది. మాటలు కలవలేదు. డబ్బింగ్ చిత్రమంటే గౌరవం పోయింది. దాంతో మరి డబ్బింగు చిత్రాల జోలికి పోకూడదనుకున్నాను.''

పకోడీలు కొనుక్కున్నాం. అవి తింటూ వేలుమణి మళ్లీ మొదలెట్టాడు.

''నేను ఫీల్డులోకి అసలు ఎలా ప్రవేశించానో అడిగారు కాదు! మొదట్లో నేనసలు రంగంలోకి నిర్మాతగా అడుగుపెట్టాను. ఉన్నతాదర్శాలతో వుత్తమమైన సాంఘిక చిత్రం తియ్యాలని. స్క్రిప్టు మీద నేనే కూర్చుని, కూర్చుకుని వున్న డబ్బంతా పోగేసి, పోసేసి తీశాను. నేను హీరోగా నటించిన ఏకైక చిత్రం అదొక్కటే. చిత్రం పేరు 'అవతలివీధి'. డైరెక్టర్ని కూడా నేనే. కథేమిటో తెలుసా? హీరోయిన్ అవతల వీధిలో వున్న హీరోని కలుసుకుందామని బయలు దేరుతుంది. ఆ వీధిని చేరే లోపులో ఆమె సంఘంలోని మంచీచెడులను సూచించే ఎన్నో సంఘటనల్నీ, పేదవాళ్ల కష్టాల్నీ, కుక్కపిల్లల్నీ, కుళ్ళు కాలువల్నీ ఓ తెలుగు సినిమానీ అన్నిటినీ చూస్తుంది. చివరికి ఆమె హీరో యింటి గుమ్మం ఎక్కడంతో కథ సమాప్తమవుతుంది. ట్రాజెడీ లెండి. అంటే – హీరో యింట్లో వుండడు. తలుపు తాళం వేసుకుని ఎక్కడికో పోతాడు. 'ఏ' క్లాస్ సెంటర్స్‌లో యింటర్‌వెల్ దాకా ఆడింది. ఆ దెబ్బతో నటుడిగా మారిపోయాను. నేను నటుడిగా తారాపథం అందుకోవాలని రాసి పెట్టినట్టుంది. అదుగో? ఆదర్శ చిత్రం అలా కలిసొచ్చింది.''

పకోడీలు అయిపోయేయి, బాగా చీకటి పడింది.

''రండి పోదాం'' వెనక్కి తిరిగేం. ''అన్నట్లు యింత సేపూ మీ గురించి ఏమీ అడగనే లేదు, ఏమైనా రికమండేషన్ లెటర్స్ తెచ్చారా?''

''లేదు''.

''లేకపోయినా ఫరవాలేదు. నేనున్నానుగా. సాటి నటుల్ని ఆదరించడం మేటి నటుడిగా నా మొదటి విధి. మీకు ఫీచర్స్ వున్నాయి. అంచేత ఫ్యూచర్ వుంటుందనుకుంటున్నాను. కొన్నాళ్ళపాటు నాతో స్టూడియోల్లో తిరుగుతూ షూటింగ్స్ ఫాలోకండి. నెమ్మదిగా తెలుస్తుంది. రేపు మోహినీలో నాకు షూటింగ్ వుంది. ఇదివరకెన్నడూ ధరించనటువంటి ఒక విభిన్నమైన పాత్ర ధరిస్తున్నాను. పొద్దున్న మిమ్మల్ని కూడా తీసుకుపోతాను! చూద్దురు గాని''.

వేలుమణికి గుడ్‌నైట్ చెప్పి రూమ్‌కి వచ్చేసరికి బాగా రాత్రయింది. నా వేషం గురించి ఆలోచించడం మానేసి వేలుమణి పరిచయం గురించి ఆలోచించాను. ఉదయం ఎనిమిది గంటలకల్లా వీ.కె. రెస్టారెంటు దగ్గరుండమన్నాడు. రెప్పలు బరువెక్కేదాకా రేపు గురించి ఆలోచించాను.

తెల్లారింది.

అనుకున్న ప్రకారం వేలుమణితో మోహినీకి వెళ్ళాను. వేలుమణి నన్ను ఫ్లోర్‌లోకి నడవమని మేకప్‌కి వెళ్ళాడు. అక్కడ అనుకోకుండా నా చిన్ననాటి స్నేహితుడు యాదవరెడ్డి కనిపించాడు. పబ్లిసిటీ శాఖకి యిన్‌ఛార్జిట. మాటల్లో వేలుమణి నటిస్తున్న చిత్రానికి నిర్మాతల్లో తనూ ఒకడని తెలిసింది. రెడ్డీ, నేనూ కబుర్లు చెప్పుకుంటూ వేలుమణి వేలుపెట్టి చూపించిన ఫ్లోర్‌లోకి వెళ్ళాం. ఏదో రైసుమిల్లు ఖాళీచేసి పెట్టినట్టుంది. లోపలికి అడుగు పెట్టగానే గాడిపొయ్యిలో ప్రవేశించినట్టనిపించింది నాకు. ఉక్కబోత ప్రారంభమైంది. అక్కడేదో అడివిలా సెట్టు వేశారు. కాగితాల్తో తయారుచేసిపెట్టిన రాళ్ళూ, రప్పలూ కంటికి బరువుగా కనిపిస్తున్నాయి. నరికితెచ్చిన చెట్ల కొమ్మలు ఆకులన్నీ వాడిపోయి ఫెయిలయిన చిత్రాల నిర్మాతల్లా నిండి వున్నాయి. అక్కడా అక్కడా ప్లాస్టిక్ పువ్వులు, తీగలు కూడా అమర్చేరు.



స్పాట్‌లైట్లు, కెమెరా వగైరాలతో జనం హడావుడిగా ఏవో సర్దుబాట్లు చేసుకొంటున్నారు. 'మంచి పిడుగులు' అనే జానపద చిత్రం తాలూకు షూటింగట అది. కాస్సేపటికి రాకుమారుడి వేషంలో హీరోగారు సిగరెట్టు కాల్చుకుంటూ ప్రవేశించారు. ఆయన్ని నేనిదివరకు చాలా చిత్రాల్లో చూసాను. అంచేత చూడగానే గుర్తుపట్ట గలిగాను.

స్టంటు మేష్టర్లు, హీరో, ఒక గొరిల్లా కెమేరా ముందుకి చేరేరు. స్టంట్ మేష్టర్లు కొట్టుకుంటూ కుమ్ముకుంటూ షాట్ వివరిస్తున్నారు. బాగా ఎండెక్కినట్టుంది. ఉక్కబోత భరించలేకుండా తయారైంది. ఉన్న రెండు ఫాన్లు ఎంత తిరిగినా గాలి చాలడం లేదు. ఎంత ఫానుకుంత గాలి. పీల్చడానికి సరిపోయే గ్గాలి మాత్రమే కదుల్తోంది.

గొరిల్లా యాతన భరించలేక రెండు చేతుల్తోనూ తల వూడదీసేసుకుంది, ఆశ్చర్య పోయాను - వేలుమణి తల కనబడింది నాకు. నిన్న తను చెప్పిన పాత్ర యిదా అనుకొన్నాను. ఆయాసపడుతూ ముఖం నిండా పట్టిన చెమటల్ని తుడుచుకో బోతుంటే స్టంటు మేష్టరు 'ఉc ఉc! మాస్క్ తగిలించుకో!' అంటూ వేలుమణిని చేత్తో పొడిచేడు. సగం వూపిరితో సరిపెట్టుకుంటూనే వేలుమణి మాస్క్ తగిలించుకున్నాడు. మాస్క్ తగిలించుకున్న వేలుమణిని చూస్తుంటే మనిషిగా అనుకోడం కష్టంగానే వుంది. అచ్చం గొరిల్లాలాగే కనిపిస్తున్నాడు. స్టంట్ మేష్టరు ''షాట్ రెడీ, లైట్స్ ఆన్....'' అంటూ నాలుగైదు శబ్దాలు చేశాడు. హీరో మీదికి గొరిల్లా మీదికి దీపాలు ఫోకస్ చేసారు. గొరిల్లా నెమ్మదిగా వచ్చి తెలుగు సినిమాలో ప్రేమించుకున్నట్టు హీరోని వెనకనించి వాటేసుకుంది. హీరో ఏమీ కంగారుపడకుండా గొరిల్లా కడుపులో మోచేత్తో గుద్దాడు. ఆ దెబ్బకి వేలుమణి వెనక్కి తూలి కింద పడ్డాడు. 'కట్' అన్నారు. వేలుమణి బాధగా కడుపు చేత్తో పట్టుకుని లేవడానికి ప్రయత్నం చేస్తూంటే, స్టంట్ మాస్టరు ''లే! లే!'' అని గదమాయించాడు. అప్పుడు హీరో చిరునవ్వుతో ''దెబ్బగట్టిగా తగిలిందా బ్రదర్'' అంటూ వేలుమణిని ఒంటిచేత్తో లేవదీశాడు. వేలుమణి సఫకేషన్ భరించలేక ఒక్కసారి మాస్క్ తీశాడు. చెమటలు పట్టిన అతని ముఖంలో బాధని నేను చూడలేక పోయాను. గంటకాలం వేడెక్కింది. అదే షాటు పదే పదే తీస్తున్నారు. వేలుమణి పడే వేదన నేను భరించలేక పోయాను. యాదవరెడ్డితో ''బైటికి పోదాం'' అన్నాను. ''కాఫీ వచ్చింది. తాగి వెడదాం'' అన్నాడు. కాఫీ నేను తాగలేక పోయాను. అది నా కంటికి మకిలి కాఫీలా కనబడింది. వేలుమణి చెమటలా కూడా కనబడింది. ఫీల్డులో కింకా ప్రవేశించక పోయినా కాఫీ తాగినట్టు బాగానే నటించాను.

ఫ్లోర్ బైటికి వచ్చేసే ముందు ఒక్కసారి వేలుమణి కేసి చూశాను. ఒక చేత్తో మాస్క్ పట్టుకుని జాలిగా నావేపు చూస్తూ మరో చెయ్యి నీరసంగా వూపేడు. నేను ఆముదం తాగిన చిరునవ్వు నవ్వినట్టు ఒక చిరునవ్వు నవ్వి కదిలేను. నిన్న సాయంత్రమంతా నాతో తిరిగిన వేలుమణికి యీ వేలుమణి డూప్‌లా అనిపించేడు.

''ఎలా వుంది?'' అన్నాడు యాదవ రెడ్డి.

''చాలా హృదయ విదారకంగా వుంది'' అన్నాను.

''నీది మరీ కుర్రవాడి మనస్తత్వం. గొరిల్లా హీరోని చంపేస్తుందనుకున్నావా? కాదు. హీరో చేతిలో అదే చచ్చిపోతుంది''.


''అవును చూశాను''

''గమ్మత్తేమిటంటే అది గొరిల్లా కాదు''

''అవును, వేలుమణి''.


''వేలుమణీ కాదు వెంకట సుబ్బయ్యా కాదు. అది సీతామహాలక్ష్మి. మాంచి సెక్స్ డాన్సర్. చనుకట్టు తీరు బాగుంటుంది. సినిమాలో గొరిల్లా చావగానే శాపవిమోచనమై గంధర్వకన్య అవుతుంది. అప్పుడు గంధర్వకన్య వేషంలో సీతామహాలక్ష్మి డాన్సు చేస్తుంది. బ్రహ్మాండమైన ఓపెనింగ్స్ వుంటాయి తను పిక్చర్లో వుంటే''.

యాదవరెడ్డి మాటలు వింటూ ఎంతో



ఇటీవల దివంగతులైన గుమ్మడి 23.7.1971న డా.కె. వివేకానందమూర్తికి రాసిన ఉత్తరం

# నేను చూసిన నక్షత్రాలు



నేను చాలా సినిమాల్లో నటించాను. చాలా మంది సినిమా వాళ్లతో పరిచయాలూ ఉన్నాయి. అక్కడ ఆర్టిస్టులు సఫర్ అయ్యేది బాగా దగ్గరగా చూశాను. ఆ బాధలు అనుభవించాను. అక్కడ చిన్న వాళ్ళను ముష్టివాళ్ళలా ట్రీట్ చేస్తారు. జూనియర్ ఆర్టిస్ట్‌లు చాలా హింసపడుతుంటారు. తారాపథంలో కనిపించని నక్షత్రాలు ఎన్నో ఉంటాయి. సినిమా విజయం వెనుక కూడా కనిపించని ఎందరో ఆర్టిస్టుల శ్రమ ఉంటుంది. దీనినే కథగా రాశాను.


**-కె.వివేకానందమూర్తి**

vivekamkadiyala@aol.com

సెల్ : -01942602205


సేపు గడిపాను. 'పని మీద వచ్చావా' అని అడిగినప్పుడు, సెలవుల్లో ఏం చెయ్యాలో తోచక సరదాగా మద్రాసులో తిరిగి పోదామని వచ్చేశానని చెప్పాను. ఆ సాయంత్రం రెడ్డి నన్ను హోటల్లో రూము ఖాళీ చేయించి వాడింటికి తీసుకుపోయాడు.

ఫ్లోర్‌లో అసంగతంగా విడిపోవడం వల్ల మళ్లీ వేలుమణి, నేనూ కలియడం జరగలేదు. అతని గురించి జాలిపడుతూ ఆలోచించడం తప్ప నాకు అతన్ని మళ్ళాకలిసే ప్రయత్నం చెయ్యాలనిపించలేదు. వేలుమణి కూడా ప్రయత్నించినట్టు లేదు.

వేలుమణిని చూశాక నాకు వేషం మీద మోజు తగ్గింది. నాల్గురోజుల పాటు వూళ్లో తిరిగాను.

ఆ మర్నాడు రెడ్డితో పబ్లిసిటీ సెక్షన్‌లో కూర్చున్నప్పుడు వేలుమణి పిల్లిలా వచ్చాడు. వంగి నమస్కారం పెట్టాడు. రెడ్డి వేలుమణిని చూడకుండా యాష్ ట్రే కదుపుతూ, నుసికేసి చూస్తూ "ఏవఁయ్యా!" అన్నాడు. నేను వేలుమణికేసి చూశాను. నాకేసి చూసి యిరకాటంగా చిరునవ్వు నవ్వుతూ.

"అబ్బే! ఏమీ లేదండి" అంటూ నసిగాడు.

"ఏమిటయ్యా! పిక్చరంతా పూర్తయ్యాక, నీకు రావలసిందంతా ముందే తీసుకున్నావుగా".

"అది కాదండి యీ సారన్నా టైటిల్స్‌లో కాస్త నాపేరు రాయించండి సార్".

రెడ్డి ఫకాలున నవ్వాడు. "ఓస్ అదా! సర్లే వెళ్ళు".

వేలుమణి చిన్నబుచ్చుకుంటూ వెనక్కి తగ్గేడు. నన్ను కూడా నవ్వు కలపమన్నట్టు రెడ్డి నాకేసి చూస్తే సగం నవ్వు కష్టంగా నవ్వాను.

ఆ తర్వాత రోజు రెడ్డి నన్ను ఆఫీసులో కూర్చోబెట్టి ఎక్కడికో వెళ్ళాడు. ఆ సెక్షనంతా తిరుగుతూంటే ఓ టేబుల్ మీద 'మంచి పిడుగులు' తాలూకు టైటిల్ షీట్స్ కనిపించాయి. యింకా డైరెక్టర్ పేరూ, నిర్మాతల పేర్లు పూర్తిగా దిద్దలేదు. వెదికిచూస్తే వేలుమణి పేరెక్కడా నాక్కనబడలేదు. నాకు మళ్లీ జాలేసింది. యింకా రెడ్డి రాలేదు. అక్కడ యీజీ ఛైరొకటి కనిపిస్తే అందులో అనీజీగా వాలి కళ్ళు మూసుకున్నాను.

కళ్ళు తెరిచేసరికి వెళ్ళిపోతున్న వేలుమణి వెనకభాగం కనబడింది నాకు. యింకా రెడ్డి రాలేదు. ఎందుకో అనుమానం వచ్చి మళ్ళా టైటిల్ షీట్స్ దగ్గరికి వెళ్లేను. పైకి తీసిన షీటు మీద ఉప పాత్రధారుల పేర్ల క్రింద "గొరిల్లా - వేలుమణి" అని కొంకిగీతల్తో రాసుంది. దాంతో ఆ షీటంతా అసహ్యంగా తయారయింది. ఆ సినిమా మొత్తానికి టైటిల్స్ ఒక్కటే బాగుంటాయనుకున్న నాకు, ఆ కాస్త ఆశకూడా పోయింది. అయినా ఎందుకో వేలుమణి మీద జాలిపడుతున్న నా మనసుకి వుపశమనం కలిగినట్టయింది.

మద్రాసు వదిలి వచ్చేముందు 'మంచి పిడుగులు' ప్రీవ్యూ చూశాను. విచిత్రం. టైటిల్స్‌లో వేలుమణి పేరు కనబడలేదు. కుత్తుకలోనే కట్ చేసినట్టున్నారు. వేలుమణి ప్రయత్నం కాస్తా వెర్రి ప్రయత్నమైపోయింది. తెరచాటు బ్రతుకు మరీ కత్తెరచాటు బ్రతుకై పోయింది.

అన్ని చిత్రాల్లోనూ చిన్నపాత్రల్లోనే కనిపించే వేలుమణి చిత్రం ఏమిటంటే యిందులో కనీసం మనిషిగానైనా కనిపించలేదు. అచ్చుమచ్చు అడివిలో తిరిగే గొరిల్లాలాగే వున్నాడు. జంతువై మరణించాడు. నాకు మాత్రం వేలుమణి మరణించినట్టు వుంది. చివరికి ప్రేక్షకులు వేలుమణిని వేషం వేసిన మనిషి అని కూడా అనుకోరు. ఏ సర్కసు మృగమో అనుకుంటారు. కానీ వేలుమణి కూడా చిత్ర విజయానికి తోడ్పడతాడు. పాపం! తాజ్‌మహల్ కట్టిన కూలీలాగే తారాపథంలో వేలుమణి కనపడని నక్షత్రంగా వుండి పోతున్నాడు.

ఏమిటో నటుణ్ణి కావాలని మద్రాసు వెళ్ళి వేలుమణి ధర్మమా అని మళ్ళీ - కథ వ్రాయడం మానేయడం మానేసి, రచయితనయి పోయాను. నేను మరి కంచికి వెళ్ళను.

★

కవిత

# జఖ్మీ షాయర్




కొన్నాళ్ళు
మతి భ్రమించినట్టే వుంటారు
కారప్పొడి చల్లినట్టే ఎగురుతారు
వేడినీళ్ళు పడినట్టే అరుస్తారు
వేలు తెగిపడినట్టే వణుకుతారు
వదరు బోతులను
గిలగిలా కొట్టుకోనీయండి!
తిన్నది అరిగేదాకా
తనివితీరా, తిట్టుకోనీయండి!
వాళ్లకదేపనీ-
డప్పు కొట్టుకుంటూ
అలా బజారుకెక్కనీయండి!
అనారోగ్యంతో బాధపడినట్టు
సలసల మసలి పోనీయండి!

నేనురాసే వాక్యం
ఎర్రని వేడివేడి
ఇనుప చువ్వలా కాలుతుందని
రగిలే పదాల సెగలు
పులి కళ్ళలా మండుతాయని
పద్యం ఎత్తుగడ
జలపాతంలా దూకుతుందని
ముగింపేమో-
బాణంలా గుచ్చుకుంటుందని
భయపడి భయపడి చస్తారు
వాళ్ళనలా చావనీయండి!

ప్రచురించిన పుస్తకం
పాము చర్మంలా వుంటుందని
పేజీలు తెరిస్తే
కరవాలం జారిపడుతుందని
కొన్నాళ్ళు
మదన పడనీయండి!
ఏదీ చేతగాక
ఏమీ చేయలేక
వాళ్ళకు తెలియకుండానే
చురకత్తి వాడినీ
నిప్పుకణం వేడినీ
అలా ప్రచారం చేయనీయండి!

పదునేంటో
సాధనేంటో
కట్టలు తెగిన కోపంతో
కవిత్వం గురించి
నిజాన్ని చెప్పనీయండి!

**-ఆశారాజు**